క్లుప్తంగా

భోగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే డీఎన్నార్ పూజలు



కలిదిండి: పాతాళ భోగేశ్వర స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థాన ఆవరణంలో కాపు, తెలగ, ఒంటరి, బలిజ మున్నూరి కాపు, తూర్పు కాపు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరావు, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గ రాణి, మసిముక్కుల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రు సీఆర్‌పీకి సేవారత్న పురస్కారం



పామర్రు: విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్సు పర్సన్‌గా (సీఆర్పీ)గా విధులు నిర్వర్తిస్తున్న వెన్నా నాగ శివరామప్రసాద్‌కు ఆదివారం సేవా రత్న పురస్కారం అందజేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రంలో ప్రభుత్వ రంగంలో సేవలు అందిస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు సేవా పురస్కారం అందించింది. గన్నవరంలో ఆదివారం ఈ సేవా పురస్కారం అందజేశారు. గన్నవరం ఎంపీపీ అనగాని రవి చేతుల మీదుగా ఈ పురస్కారం అందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్. వెంకట్, రజిత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఓటునకు దరఖాస్తు చేసుకోండి

రాపర్ల(పామర్రు): అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రాపర్ల, పోలవరం గ్రామాలలో పోలింగ్ బూత్ లను ఆలయ ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఓటు తోనే మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని పర్వత వర్ధనీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామికి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి అన్నాభిషేకం జరిపి తదుపరి స్వామికి లక్ష బిల్వాలతో బిల్వ పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు ఎం శివ శంకర్ దంపతుల సౌజన్యంతో ఆలయంలో పూజా కార్యక్రమాలకు కొమ్మకూరి కనకలింగేశ్వర శర్మ, కొమ్ముకూరి కార్తీల ఆధ్వర్యంలో జరిగాయి.

నేడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఉషారాణి ప్రమాణస్వీకారం

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత తుమ్మల ఉషారాణి పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని ఉషారాణి పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి చైర్‌పర్సన్ పదవిని ఇచ్చిన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు ఎప్పుడు రుణపడి ఉంటాన్నారు. ఇదే మండలానికి చెందిన వింజరంపాడు గ్రామానికి చెందిన కొడవళ్ల రజిని, అప్పికట్ల గ్రామానికి చెందిన సాయల నాగరాజు, జువ్వనపూడి గ్రామానికి చెందిన పేటేటి ఆదియ్యలు కమిటీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పామర్రు మార్కెట్ యార్డు..

పామర్రు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకరణ మహోత్సవం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ హాజరవుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.

క్షణ క్షణం.. మిచాంగ్ భయం



రాపర్లలో పనలపై ఉన్న వరి పంట



తోట్లవల్లూరులో యంత్రంతో ధాన్యం నూర్పిడి



తోట్లవల్లూరు రోడ్డులో నేలవాలిన వరిపైరు

మిచాంగ్ తుపాను రైతుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. వరికోతలు, కట్టేతలు, యంత్రాలతో ధాన్యం నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తుపాను రాక సమాచారం అన్నదాతల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. ఆకాశంలో మబ్బులు, వర్షపుజల్లులు రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తుపాను గండం ఎలాగోలా గట్టెక్కాలని రైతన్నలు దేవుళ్లను ప్రార్థిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట 20శాతం పనల దశలో, 10శాతం కుప్పలు వేసిన దశలో, 20శాతం వరకు మిషన్లతో నూర్పిళ్లు పూర్తి అయిన దశ, 50 శాతానికి పైగా కోత కోయాల్సిన దశలో ఉంది. దీంతో వ్యవసాయశాఖాధికారులు ఇప్పటి నుంచి ఎవ్వరూ కోతలు కోయవద్దని సూచిస్తున్నారు. కోత కోసినా పనలు ఆరిన తర్వాతే కుప్పలుగా వేయాలని చెబుతున్నారు.

– తోట్లవల్లూరు/పామర్రు



పామర్రులో హడావుడిగా వరి కుప్పలు వేస్తున్న రైతులు



రొయ్యూరు వద్ద కరకట్టపై ఆరబెట్టిన ధాన్యం

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ముదినేపల్లి రూరల్: తుపాను ప్రభావంతో కురిసే వర్షాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏఈ పేర్ని రవికుమార్ విద్యుత్ వినియోగదారులకు సూచించారు. ఆక్వా రైతులు ఏరియేటర్లను ముట్టుకోరాదని హెచ్చరించారు. గృహ సర్వీసులకు సంబంధించి సర్వీస్ తీగలను లేదా వాటితో వేలాడే ఇనుప తీగలను తాకరాదన్నారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే స్థానిక సిబ్బందికి లేదా సబ్ స్టేషన్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధిచెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. భక్తులు పుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకున్నారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగ బంధాల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు,కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేలసంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



తోట్లవల్లూరులో కార్తిక వనసమారాధనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



యాదవ సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి



శ్రీభావనరుషికి పూజలు చేస్తున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ

తోట్లవల్లూరు: వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన కార్తిక వనసమారాధన మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆదివారం ఘనంగా జరిగింది. కార్తిక మాసం పురస్కరించుకొని స్థానిక శివాలయం ఆవరణలో ఆర్యవైశ్యులు ఉసిరిచెట్టుకు పూజలు, సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం జరిగిన అన్నసమారాధలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు తమ్మన ఉమామహేశ్వరరావు, కార్యదర్శి నంబూరి శివనారాయణ, వాసవీ ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్యసుధాకర రావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శేష శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో..

గుడివాడ టౌన్: కార్తిక వన సమారాధనలు ఆదివారం పట్టణంలో పలు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో గుడివాడ నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలకు, చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు పుట్టి రాంబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు దారం నరసింహరావు, దారం ఏడుకొండలు, తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో..

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ చౌక్ లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కార్తిక వన సమారాధనలు జరిగాయి. వాసవీ సంఘం అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, సముద్రాల వెంకట జగ్గారావు, జవ్వాది ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వడాలిలో కార్తిక వనసమారాధన

ముదినేపల్లి రూరల్: వడాలిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని పద్మశాలీల ఆరాధ్యదైవమైన శ్రీభావనరుషికి పూజలుచేసి సమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్తిక వనసమారాధన నిర్వహించిన పద్మశాలీ సంఘం నేతలను అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు శీలం రామకృష్ణ, కిషోర్, రెడ్డి సతీష్‌బాబు, సాయిబాబు, దివి సతీష్, అనగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐక్యతను చాటిన కార్తిక వనసమారాధనలు

కైకలూరు: కార్తీక వనసమారాధనలు పలు ప్రాంతాల్లో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. కై కలూరు సీఎన్నార్ గార్డెన్‌లో కమ్మ కార్తిక వనసమారాధన నిర్వహించారు. చదువులో ప్రతిభచూపిన 21 మంది విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున సంఘం ఆర్థిక సాయాన్ని అందించారు. మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ చింతపల్లి రాజరాజేశ్వరీ, శ్రీనివాసరావు దంపతులు ఉసిరి చెట్టుకు పూజ చేశారు.



ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో అన్నసమారాధన

గోపవరంలో..

ఐలమ్మ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో గోపవరంలో రజక కార్తిక వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ సంఘ నాయకులు లావేటి వీరశివాజీ, బొమ్మనబోయిన విజయలక్ష్మి హాజరయ్యారు. సంఘ నాయకులను సత్కరించారు.

ఆటపాక పక్షుల అందాలు అద్భుతం

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కై కలూరు: ఆటపాక పక్షుల అందాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కితాబిచ్చారు. కుటుంబ సమేతంగా పక్షుల కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. బోటు షికారు చేస్తూ దగ్గర నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను ఆస్వాదించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆటపాకలో ఆహ్లాదకర వాతావరణం ఎంతో ఆకట్టుకుందన్నారు. పక్షుల వీక్షణకు ఇదే సరైన సమయమని జిల్లా ప్రజలందరూ పక్షుల కేరింతలను తిలకించాలని పిలుపునిచ్చారు. అటవీశాఖ అధికారులు మ్యూజియం రక్షణ గోడ వద్ద విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టరును కోరారు. స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ ఎస్ఈకి ఫోన్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆటపాక పక్షుల కేంద్రంలో మౌళిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అటవీ శాఖ రేంజర్ కుమార్, తహసీల్దార్ బి.మురళీకృష్ణ, డెప్యూటీ తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తదితరులు ఉన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి బోటు షికారు చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

వాహన చోదకులు సహకరించాలి

డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహన చోదకులు, ఆటోడ్రైవర్లు పోలీసులకు సహకరించాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ కోరారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ఆటో డ్రైవర్లకు, వాహనచోదకులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన సదస్సును ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆటోడ్రైవర్లు ఆటోల్లో సరిపడా ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకోవాలని, పరిమితికి మించి ఎక్కించుకోకూడదని సూచించారు. ఆటోడ్రైవర్ల తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, ఆటోలను టర్నింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా సిగ్నల్ సూచికను పాటించాలన్నారు. మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని వీటిని నివారించేందుకు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. అనంతరం ఉన్నత విద్య అభ్యసిస్తూ ప్రతిభకనబరుస్తున్న ఆటోడ్రైవర్ల పిల్లలకు రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఐదుగురికి డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వన్, టూటౌన్ సీఐలు కె.ఇంద్రశ్రీనివాస్, బి.తులసీధర్, ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అంగడాల సతీష్, ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డిఎస్పీ పి.శ్రీకాంత్

ఘనంగా సెమీ క్రిస్మస్

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్‌లోని సైమన్ చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, శ్రీనుబాబు, డాక్టర్ రాజ్‌కుమార్, పాస్టర్లు వినయ్‌కుమార్, డేవిడ్‌పాల్, నియోజకవర్గ పాస్టర్లు, దైవజనులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



మండవల్లి సెమీ క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ప్రత్యేక శిబిరాలతో మంచి ఫలితాలు

గుడివాడ టౌన్: సవరించిన ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఆర్డీఓ పి. పద్మావతి అన్నారు. ఆదివారం ఆమె మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, తహసీల్దార్ కె. ఆంజనేయులుతో కలసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓల పనితీరు, ఓటర్ల స్పందన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా నిర్వహించిన శిబిరాల వలన మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సుమారు 1200 పైబడి ఓటర్ల నమోదు చేర్పులు, మార్పులు జరిగాయన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ పద్మావతి

ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలకాలపై రైతుల హర్షం

బంటుమిల్లి: తుపాను ప్రభావంతో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో యుద్ధప్రాతిపదికన తరలించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత కొన్ని రోజులుగా సార్వా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి కోతలు నిలిపివేయాలని సూచించారు. ఇప్పటివరకు కోతలు పూర్తి చేసిన రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆర్‌బీకేల వద్ద సంచులను సిద్ధంగా ఉంచడంతో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని సంచులు తీసుకువెళుతున్నారు. ధాన్యం బస్తాలను ఆర్‌బీకే వద్దకు తీసుకువస్తున్న రైతులు ప్రభుత్వ ఆదేశాలతో పడిగాపులు పడకుండా ట్రిప్‌షీట్లు తీసుకుని వారికి నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. శనివారం వరకు ఆన్‌లైన్‌లో ఇబ్బందులు పడ్డామని, ఆదివారం ప్రభుత్వం స్పందించి ఆఫ్‌లైన్‌కు మార్చడంతో పెద్ద సమస్య పరిష్కారమైందని పలు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ ఎంవీ సత్యన్నారాయణ, వ్యవసాయశాఖాధికారి శివరామకృష్ణలు మాట్లాడుతూ కళ్లాల్లో ఉన్న ధాన్యం మిల్లులకు తరలించేందుకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని ఆర్‌బీకేల వద్ద గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితులను సమీక్షిస్తూ సంచులు ఇవ్వడంతోపాటు, బస్తాలు వెంటనే దిగుమతి అయ్యే విధంగా చూస్తున్నామన్నారు. తుపాను తీరం దాటి వాతావరణం మామూలు స్థితికి వచ్చేవరకు కోతలు కోయవద్దని రైతులకు సూచించారు.



ఆముదాలపల్లిలో ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

చంద్రబాబు విధానాలతోనే విద్యా వ్యవస్థ నాశనం

కైకలూరు: చంద్రబాబు అవలంభించిన తప్పుడు విధానాల వల్లే రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా వ్యవస్థన నాశనమైందని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడ్డు నోబుల్ చెప్పారు. కైకలూరులో ఆయన మాట్లాడుతూ 1990లో ఎయిడెడ్ స్కూళ్లకు బడ్జెట్ కేటాయించకుండా ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఉపాధ్యాయ పోస్టులను సైతం నియమించలేదన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎయిడెడ్, మిషన్ స్కూల్స్ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ విషయాలను మరుగునపరిచి, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు.

శ్యామలాంబకు లక్ష కుంకుమార్చన

కై కలూరు: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా కై కలూరు శ్యామ లాంబ అమ్మవారికి కై కలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామూహిక లక్ష కుంకుమార్చన ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్, రామలింగేశ్వర, శ్యామలాంబ దేవస్థానాల చైర్మన్లు బూరుబోయిన మోహనరావు, గుర్రం రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, బ్రాహ్మణ ప్రముఖులుపాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

వైభవంగా బాబా పల్లకీ సేవ

కలిదిండి: షిర్డీ సాయిబాబా పల్లకీ సేవ ఆదివారం కొండంగి సాయిబాబా మందిరం నుంచి కోరుకొల్లు సాయిబాబా మందిరం వరకు వైభవంగా భక్తులు నిర్వహించారు. కొండంగిలో బయలుదేరి మద్దానానిగూడెం, గుర్వాయిపాలెం, కోట కలిదిండి, పేట కలిదిండి, పడమటిపాలెం, రుద్రవరం, మీదుగా కోరుకొల్లు సాయిబాబా మందిరం వరకు దాదాపు 30 కిలోమీటర్ల పాటు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో అభయ ఆంజనేయ బాలభక్త, సాయికృష్ణ, మురళీకోలాట భజన బృందాలు కోలాటం నిర్వహిస్తూ వైభవంగా పాదయాత్రను కొనసాగించారు.



బాబా పల్లకీసేవ చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఉంగుటూరు: తేలప్రోలు-నందమూరు ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన కె.స్రవంతి ఉంగుటూరు మండలంలోని జంధ్యాలవారి కండ్రికలో ఓ పూజా కార్యక్రమానికి వెళ్లారు. అక్కడ నుంచి పూజా సామగ్రి కొనేందుకు ఉంగుటూరు బయలుదేరారు. ఉంగుటూరు-లంకపల్లి బుడమేరు వంతెన మలుపు వద్ద ప్రమాదవశాత్తూ స్కూటీ అదుపు తప్పి ఎదురుగా ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన మహిళను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు.

డయాలసిస్ రోగికి పింఛన్ అందజేత

మండవల్లి: మండవల్లి గ్రామానికి చెందిన డయాలసిస్ రోగి అలుగుల దివ్య రాచపట్నం బంధువుల ఇంటికి వెళ్లింది. సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు భర్త సురేష్, వలంటీర్ సుభాషిణితో కలిసి వెళ్లి పింఛన్ సొమ్ము రూ.10 వేలు అందజేశారు. దీంతో దివ్య బంధువులు హర్షం వ్యక్తం చేశారు.





